

టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు ధర పలికాయి. మార్కెట్‌కు 784 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



ప్రమోషన్ ఇచ్చి.. తీసుకున్నారు

పదోన్నతి ఇచ్చి వెనక్కు తీసుకున్నారంటూ బెళుగుప్ప మండలం విరుపాపల్లి ఎంపీయూపీ స్కూల్ ఎస్జీటీగా పని చేస్తున్న సురేఖ వాపోయింది.

8లో

గరిష్టం/కనిష్టం
34.9°/22.4°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలిక పాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

సేవామూర్తులకు అవార్డులు

- 31 వరకూ దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం రూరల్: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం పాటుపడుతున్న వ్యక్తులు, సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అవార్డులు అందిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్ రసూల్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 31 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. www.disabilityaffaris. gov.in www.awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న జేడీ మధుసూదన్‌రావు

అనంతపురం రూరల్: వసతి గృహాల్లో నూతన మెనూ సక్రమంగా అమలు చేయాలని సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు ఆదేశించారు. గురువారం స్థానిక బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు, వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ కాస్మోటిక్ చార్జీలను నేరుగా విద్యార్థుల బ్యాంక్ ఖాతాలకు జమ చేయాలన్నారు. విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న సీట్లను ఈ నెల 25లోపు భర్తీ చేయాలన్నారు. వసతి గృహాలకు 5 కిలోమీటర్ల దూరంలో నివాసం ఉన్న వారికి ప్రవేశాలు కల్పించరాదన్నారు. ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో చర్చించి ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్లు అందేలా చూడాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉందన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఫార్మసీలో ఆనర్స్ డిగ్రీ



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ వీసీ జింకా రంగజనార్ధన

అనంతపురం: బీ–ఫార్మసీలోనూ ఆనర్స్ విధానం అమలు చేయాలని 5వ ఫార్మసీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ మీటింగ్‌లో నిర్ణయించారు. జేఎన్‌టీయూ (ఏ) పాలక భవనంలో ఫార్మసీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ల సమావేశం గురువారం జరిగింది. సమావేశానికి జేఎన్‌టీయూ వీసీ జింకా రంగజనార్ధన అధ్యక్షత వహించారు. ఆర్–23 (రెగ్యులేషన్) గురించి విపులంగా చర్చించారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు బీ-ఫార్మసీ కోర్సుల్లో ఆనర్స్ లేక రీసెర్చ్ డిగ్రీలను అమలు చేయాలని నిర్ణయించారు. రెగ్యులర్ బీ-ఫార్మసీ చేస్తూనే విద్యార్థులు అదనంగా 12 క్రెడిట్‌లు సాధిస్తే ఆనర్స్ డిగ్రీ ప్రదానం చేస్తారు. స్కిల్ ఓరియంటెడ్ కోర్సులు, నాలుగు ప్రొఫెషనల్ ఎలక్టివ్స్, రెండు ఓపెన్ ఎలక్టివ్స్ , క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ పాలసీని , రెండు సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రవేశపెట్టనున్నారు. ఆనర్స్ డిగ్రీపై ఆసక్తి గల వారు బీ-ఫార్మసీ మూడో సెమిస్టర్ వరకూ '7 సీజీపీఏ' స్కోరు సాధించాల్సి ఉంటుంది. కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ఈ.కేశవరెడ్డి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఎస్.దేవన్న, డీఏపీ వి.సుమలత, ఐఐటీ ప్రొఫెసర్లు ఆశిత్‌కుమార్, చక్రవర్తి, డాక్టర్ ఎంఏసీఎస్ బయో ఫార్మా హైదరాబాద్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, రైపర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశుని సేవలో సినీ నటి ఆమని



ఆమనికి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని ప్రముఖ సినీ నటి ఆమని గురువారం దర్శించుకున్నారు. తాడిపత్రిలో షూటింగ్‌కు వచ్చి దైవదర్శన కోసం కదిరికి వచ్చినట్లు ఆమని తెలిపారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ విశిష్టతను వివరించారు. తీర్థప్రసాదలు అందజేసి, శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆమనితో ఫొటోలు దిగేందుకు భక్తులు పోటీపడ్డారు.

రేపు జిల్లాకు సీఎం జగన్



- కళ్యాణదుర్గంలో రైతు దినోత్సవంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- ఏర్పాట్లలో అధికారులు బిజీ
- సిద్ధమైన హెలిప్యాడ్
- సభా ప్రాంగణం వద్ద ముమ్మర తనిఖీలు
- యుద్ధప్రాతిపదికన విద్యుత్ లైన్లు, రోడ్డు మరమ్మతులు



ముస్తాబైన సభా ప్రాంగణం



స్టేజిని దగ్గరుండి ఏర్పాటు చేయిస్తున్న తలశిల రఘురాం, మంత్రి భర్త శ్రీచరణ్

కళ్యాణదుర్గం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శనివారం జిల్లాకు రానున్నారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతిని పురస్కరించుకుని కళ్యాణదుర్గంలో నిర్వహించే 'రైతు దినోత్సవం'లో ఆయన పాల్గొంటారు. సీఎం పర్యటనకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడా చిన్న లోపం కూడా తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. మల్లాపురం రోడ్డులోని గ్యాస్ గోడౌన్ సమీపంలో హెలీప్యాడ్ ఇప్పటికే సిద్ధం చేశారు. హెలిప్యాడ్ నుంచి ఏపీ మోడల్ స్కూల్ సమీపంలోని సభా స్థలి వరకు దారి పొడవునా బారికేడ్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. శుక్రవారం నాటికి పనులు పూర్తి చేస్తామని విద్యుత్ శాఖ ఈఈ సురేంద్ర తెలిపారు. సీఎం సభ విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్తున్నారు.

ముమ్మర తనిఖీలు..

సభా ప్రాంగణం వద్ద భద్రతలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సీఎం భద్రతా అధికారులు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావును ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్పీ హెలిప్యాడ్, సభా ప్రాంగణం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు పర్యవేక్షిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా బందోబస్తు చేపడుతున్నారు. హెలిప్యాడ్, సభా ప్రాంగణంలో పోలీసులు డాగ్ స్క్వాడ్, మెటల్ డిటెక్టర్ లాంటి ఆధునిక పరికరాలతో గురువారం తనిఖీలు నిర్వహించారు.

ఏర్పాట్ల పరిశీలన..

సీఎం సభ ఏర్పాట్లను గురువారం రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, సీఎం కార్యక్రమాల కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, డీఐజీ అమ్మిరెడ్డి, సీఎం సెక్యూరిటీ అధికారి రంగబాబు, జేసీ కేతన్ గార్గ్, ఎస్పీ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య పరిశీలించారు. భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కళ్యాణదుర్గం ఎన్నికల పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి, ఏఎస్పీలు హనుమంతు, విష్ణు, విజయ్ భాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, ఆర్టీసీ జోనల్ చైర్పర్సన్ మంజుళ, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, పామిడి వీరా తదితరులు ఉన్నారు.



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జేసీ, ఎస్పీలు

పనులు వేగవంతం చేయండి

కళ్యాణదుర్గం రూరల్: సీఎం సభా ప్రాంగణం వద్ద పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. గురువారం జేసీ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఆర్డీఓలు నిశాంత్ రెడ్డి, మధుసూదన్‌లతో కలిసి పనులను పరిశీలించారు. హెలిప్యాడ్, పార్కింగ్ స్థలంపై అధికారులకు పలు సూచనలిచ్చారు. సీఎం పర్యటనలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదన్నారు. రైతు లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిధుల మంజూరు, అగ్రీ ల్యాబ్ ప్రారంభోత్సవానికి సంబంధించి సాంకేతిక పనులను పూర్తి చేయాలన్నారు. హెలిప్యాడ్ వద్దకు ఎవరినీ అనుమతించకూడదని చెప్పారు.



హెలీప్యాడ్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

'గడప గడపకూ..' బిల్లుల చెల్లింపు

- కలెక్టర్ గౌతమి వెల్లడి



అనంతపురం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమానికి సంబంధించి వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులన్నీ చెల్లించేశామని కలెక్టర్ ఎం.గౌతమి గురువారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 492 పనులు పూర్తయ్యాయన్నారు. కలెక్టర్ వెల్లడించిన మేరకు..

- జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణాలకు సంబంధించి రూ.29.03 కోట్లు, సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీలకు సంబంధించి రూ.39.48 కోట్ల చెల్లింపు.
- ఉద్యానవన మొక్కలకు సంబంధించి రూ.10.64 కోట్లు, జీజీఐకి రూ.0.27 కోట్లు, ప్రతి గ్రామ పంచాయతీ స్థాయిలో చెత్త సేకరణకు రూ.0.66 కోట్లు, ఇతర పనులకు రూ.0.80 కోట్లు కలిపి మొత్తం రూ.80.88 కోట్లు విడుదల.
- జిల్లా గ్రామీణ పారిశుధ్య, నీటి సరఫరా శాఖకు సంబంధించి 2023–24 ఆర్థిక సంవత్సరంలో జల్‌జీవన్ మిషన్ కింద 587 పనులకు సుమారు రూ.9.14 కోట్లు ఖర్చు.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ద్వారా జిల్లాలో 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' అమలులో భాగంగా 38,219 మంది లబ్ధిదారులకు వివిధ నిర్మాణ స్థాయిని బట్టి సుమారు రూ.478.41 కోట్లు మంజూరు. అందులో 263 మందికి మ్యాపింగ్, ఆధార్, ఇన్ యాక్టివ్ తదితర కారణాలతో ఇంకా ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది.
- వైఎస్సార్ రూరల్ హౌసింగ్ పథకం కింద 2016–17 నుంచి 2019–2020 వరకు 4,621 మందికి రూ.14.91 కోట్లకు సంబంధించి బిల్లులు జనరేట్. త్వరలోనే ఆ నిధుల విడుదల.

ఏసీబీ వలలో అనంతపురం సబ్ రిజిస్ట్రార్

- గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్‌కు రూ.1.30 లక్షలు తీసుకుంటూ పట్టుబడిన వైనం



సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణమూర్తి



డాక్యుమెంట్ రైటర్ అసిస్టెంట్ కృష్ణమురళి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: గిఫ్ట్ డీడ్ కింద లాడ్జ్ రిజిస్ట్రేషన్ చేయడానికి లంచం డిమాండ్ చేసిన అనంతపురం సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణమూర్తి ఏసీబీకి దొరికిపోయాడు. డాక్యుమెంట్ రైటర్ చంద్రశేఖరరావుతోపాటు అతని అసిస్టెంట్ కృష్ణమురళీ ద్వారా రూ.1.30 లక్షలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.

రూ.1.30 లక్షలకు బేరం..

వివరాలను ఒంగోలు ఏసీబీ డీఎస్పీ, అనంతపురం ఇన్‌చార్జ్ ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు మీడియాకు వివరించారు. అనంతపురానికి చెందిన అన్నదమ్ములు ముత్తుకూరు రామ్మోహన్‌రావు, రవీంద్ర నాథ్ 1996లో ఆర్టీసీ బస్టాండు సమీపంలోని స్థలం కొనుగోలు చేశారు. ప్రస్తుతం 'కోమల' పేరుతో లాడ్జ్ నడుపుతున్నారు. గత నెల రామ్మోహన్‌రావు అన్న మరణించారు. దీంతో అన్న వాటాను గిఫ్ట్ డీడ్ కింద తనపేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రామ్మోహన్‌రావు భావించారు. అన్ని పత్రాలతో అనంతపురం సబ్‌రిజిస్ట్రార్‌ను కలవగా.. స్థలాన్ని పరిశీలించి అనంతరం రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు. స్థలాన్ని పరిశీలించి.. ఇది కమర్షియల్ లాడ్జ్ భవనం అయినందున రిజిస్ట్రేషన్ చేయడానికి కుదరదని తెలిపారు. అక్కడే ఉన్న డాక్యుమెంట్ రైటర్ చంద్రశేఖర్‌రావు కలుగజేసుకుని డబ్బిస్తే రిజిస్ట్రేషన్ చేస్తారని చెప్పారు. రూ. లక్ష ఇచ్చేందుకు రామ్మోహన్ సిద్ధపడినా సబ్ రిజిస్ట్రార్ ఒప్పుకోలేదు. రూ. 2 లక్షలిస్తే పని చేస్తామని చెప్పారు. డాక్యుమెంట్ రైటర్ చంద్రశేఖరరావు వద్ద బేరమాడితే రూ.1.30 లక్షలకు ఒప్పుకున్నాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని రామ్మోహన్.. ఏసీబీ అధికారులను సంప్రదించాడు. వారి సూచన మేరకు గురువారం రూ.1.30 లక్షలు తీసుకుని సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణను కార్యాలయంలో కలిశారు. అతని సూచన మేరకు డబ్బును డాక్యుమెంట్ రైటర్ చంద్రశేఖరరావు ఇవ్వగా,అతను అసిస్టెంట్ కృష్ణమురళీకి ఇచ్చాడు. సాయంత్రం 4 గంటల సమయంలో కృష్ణమురళీ నుంచి సబ్‌రిజిస్ట్రార్ తీసుకుంటుండగా, అప్పటికే మాటువేసిన ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కృష్ణమురళీ ఏసీబీ అధికారులను చూసి ఉడాయించే ప్రయత్నం చేయగా, అతనికి అక్కడే కౌన్సెలింగ్ ఇచ్చారు. సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ సెల్‌ఫోన్‌లో జరిపిన సంభాషణలు రికార్డు కావడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణతోపాటు డాక్యుమెంట్ రైటర్ చంద్రశేఖరరావు, అసిస్టెంట్ కృష్ణమురళీలను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. శుక్రవారం న్యాయస్థానంలో హాజరుపరుస్తామన్నారు.

అధికారుల నిర్బంధం..

గురువారం సాయంత్రం అనంతపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన ఏసీబీ అధికారులు వెంటనే తలుపులు మూసివేశారు. ఉద్యోగులు, సిబ్బంది నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బయటకు పంపకుండా నిర్బంధించారు. లంచం తీసుకున్న కృష్ణ మురళీని ప్రశ్నించారు. సహకరించకపోవడంతో అక్కడే కౌన్సెలింగ్ ఇచ్చారు. కాగా, రాత్రి 12 వరకూ సత్యనారాయణ మూర్తి గతంలో రిజిస్ట్రేషన్ చేసిన రికార్డులు పరిశీలించిన అధికారులు, అతని ఇంట్లోనూ సోదాలు చేసినట్లు తెలిసింది.

17న ఎస్కేయూ స్నాతకోత్సవం

- ఛాన్సలర్ హోదాలో హాజరుకానున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- గౌరవ డాక్టరేట్ అందుకోనున్న మహంతేష్



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవం ఈ నెల 17న నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా ఛాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. గవర్నర్ రాక ఖరారైనట్లు వర్సిటీ ఉన్నతాధికారులు తెలిపారు. ఒక రోజు ముందే ఆయన అనంతపురం విచ్చేయనున్నట్లు తెలిసింది.

మహంతేష్‌కు గౌరవ డాక్టరేట్..

వర్సిటీ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని గౌరవ డాక్టరేట్‌ను మహంతేష్ జి. కివాడసన్నవర్ (మహంతేష్ జీ.కే)కు ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు ప్రకటించారు. కర్ణాటక రాష్ట్రం నేగిన్‌హాల్‌కు చెందిన మహంతేష్ భారత మాజీ క్రికెటర్ కావడం గమనార్హం. దివ్యాంగుల క్రికెట్ కౌన్సిల్, క్రికెట్ అసోసియేషన్ ఫర్ బ్లైండ్ ఇండియా, వరల్డ్ బ్లైండ్ క్రికెట్ లిమిటెడ్‌కు ఆయన అధ్యక్షుడిగా సేవలందిచారు. 2012లో బ్లైండ్ వరల్డ్ టీ–20 విజేతగా నిలవడంలోనూ, 2017లో రెండో స్థానం సంపాదించడంలోనూ కీలక పాత్ర పోషించారు. 2014, 2018లో 4,5 వరల్డ్ ఛాంపియన్‌షిప్ పొందడంలో మహంతేష్ కృషి ఎంతో ఉంది. బ్లైండ్ క్రికెట్ ఆటకు రూపకల్పన చేసి, ఎంతో మంది క్రీడాకారులను తీర్చిదిద్దడంలో మహంతేష్ అంకితభావంతో పనిచేశారు. సమర్థనం అనే ట్రస్ట్ ద్వారా వేలాది మంది దివ్యాంగులకు ఉపాధి శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. 2019లో స్పిరిట్ స్పోర్ట్స్ ఇండియా అవార్డు, దివ్యజ్ఞాన్ ఎంపవర్‌మెంట్ అవార్డు ఆయన్ను వరించాయి. మహంతేష్ జీకే సేవలు గుర్తించిన ఎస్కేయూ ఉన్నతాధికారులు గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. ఎస్కేయూ ఛాన్సలర్/ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా మహంతేష్ పురస్కారం అందుకోనున్నారు.



మహంతేష్ జీకే

బీటీపీపై పిచ్చి రాతలు

- భైరవానితిప్ప ప్రాజెక్టును ఎన్నికల తాయిలంగా వాడుకున్న బాబు
- భూసేకరణ చేయకుండా, పరిహారం ఇవ్వకుండానే పనుల ప్రారంభం
- రూ. 30 కోట్లు తమ్ముళ్లకు పంచిపెట్టిన వైనం
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 6 నెలల్లో భూ సేకరణ పూర్తి
- గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బిల్లులూ మంజూరు
- పరిహారం మంజూరుకు ప్రతిపాదనలు పంపిన అధికారులు
- ఇవన్నీ దాచి అవాస్తవాలు ప్రచురించిన 'పచ్చ' పత్రిక

బాబు హయాంలో జరిగిందిదీ..

2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం బీటీపీ ప్రాజెక్టును తమ్ముళ్లకు ఆదాయ వనరుగా మార్చింది. 2019 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజా వ్యతిరేకత నుంచి కాపాడుకునేందుకు ఆర్భాటంగా కొన్ని కార్యక్రమాలు చేసింది. 2018లో భూ సేకరణ చేయకుండానే ఆదరాబాదరాగా ప్రాజెక్టు పనులను చంద్రబాబు ప్రారంభించారు. సుమారు రూ. 30 కోట్ల వరకూ ఖర్చు చేశారు. కొందరు టీడీపీ నాయకులు మట్టి పనులు మాత్రమే చేసి నిధులు దండుకున్నారు.

సీఎం జగన్ వచ్చాక ఇలా..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి హోదాలో రాయదుర్గం వచ్చిన వైఎస్ జగన్ భూ సేకరణ కార్యక్రమాన్ని 6 నెలల్లో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం పూర్తి చేశారు. సుమారు 1,406 ఎకరాలకు రూ. 208.85 కోట్లు అవసరం అవుతుందని గుర్తించారు. గత ప్రభుత్వంలో చేసిన పలు పనులకూ బిల్లులు మంజూరు చేశారు. జరిగింది ఇలా ఉంటే, ఓ పచ్చపత్రికలో మాత్రం అవాస్తవాలను వల్లెవేసేశారు.

ఫ్యాక్ట్ చెక్

అనంతపురం సెంట్రల్: 2004కు ముందు తాగునీటి ప్రాజెక్టుగా పరిశీలనలో ఉన్న హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టును సాగునీటి ప్రాజెక్టుగా మార్చిన అపర భగీరథుడు దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి. వైఎస్సార్ హయాంలోనే హంద్రీనీవా మొదటి దశ పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. 2012 నుంచి కృష్ణా జలాలు జిల్లాకు వస్తున్నాయి. బెళుగుప్ప మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్ నుంచి రాయదుర్గం నియోజకవర్గంలో భైరవాని తిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలను తరలించేందుకు ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. 93 కిలోమీటర్ల కాలువ నిర్మాణం, 8 లిఫ్టులు, 8 సబ్‌స్టేషన్‌ల నిర్మాణం జరగాల్సి ఉంది. ఇందుకోసం రూ. 542 కోట్లు (భూసేకరణ కాకుండా) అవసరం కానుంది. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి 3.7 టీఎంసీలను తరలించేందుకు వీలుగా కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 114 చెరువులు నింపడానికి 1.7 టీఎంసీలు, బీటీపీ ప్రాజెక్టుకు 2 టీఎంసీలు తరలించి ఆ ప్రాంత రైతులకు తాగు, సాగునీటి కష్టాలు తీర్చడమే ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం.

మభ్య పెట్టేందుకే చంద్రబాబు బీటీపీ జపం..

కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలను సస్యశ్యామలం చేయడానికి ఏర్పాటు చేసిన బీటీపీ (భైరవాని తిప్ప) ఎత్తిపోతల పథకాన్ని టీడీపీ ప్రభుత్వం 2019 ఎన్నికల సమయంలో ప్రజలను మభ్య పెట్టేందుకు పావుగా వాడుకుంది. ఏదైనా ఒక ప్రాజెక్టు ప్రారంభించే ముందు నిర్మాణ సమయంలో భూములు కోల్పోతున్న బాధితులకు పరిహారం చెల్లించాలి. ఆ తర్వాతనే ప్రాజెక్టు నిర్మాణానికి ముందుకుపోవాలి. చంద్రబాబు మాత్రం అధికారంలో ఉన్న తొలి నాలుగేళ్లలో విస్మరించి.. చివరి ఏడాదిలో ప్రజా వ్యతిరేకత నుంచి బయటపడేందుకు బీటీపీ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. అది కూడా భూములు కోల్పోతున్న వారికి ఒక్క రూపాయి కూడా పరిహారం చెల్లించకుండానే!. అలా 2018లో ప్రారంభించి రూ. 30 కోట్ల మేర మట్టి పనులు చేసి చేతులు దులుపుకున్నారు. ఆ పనులు కూడా తమ పార్టీ కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకే చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

త్వరలో ప్రతి రైతుకూ పరిహారం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాయదుర్గం పర్యటనకు వచ్చిన సందర్భంగా భూసేకరణ చేస్తామని డిక్లరేషన్ ఇచ్చారు. మాట ప్రకారం భూసేకరణ పూర్తి చేశారు. రైతులకు చెల్లించాల్సిన పరిహారాన్ని అధికారులు గుర్తించారు. ఇటీవల ప్రాజెక్టుపై సమగ్ర ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. పెండింగ్ బిల్లులకు రూ. 27 కోట్లు, పనులు ప్రారంభించడానికి రూ. 46 కోట్లు, భూసేకరణ మొత్తం రూ. 208.85 కోట్లు ఇవ్వాలని పేర్కొన్నారు. దీనిపై త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశముందని హంద్రీనీవా అధికార వర్గాలు పేర్కొన్నాయి.



భైరవానితిప్ప జలాశయం



బీటీపీ కాలువ పనులను పరిశీలిస్తున్న హంద్రీనీవా ఎస్ఈ దేశేనాయక్, అధికారులు (ఫైల్)

ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది

బీటీపీ పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈ ప్రభుత్వ హయాంలోనే భూసేకరణ పూర్తి చేశాం. భూములు నష్టపోయిన రైతులకు చెల్లించాల్సిన పరిహారం, పెండింగ్ బిల్లులు, ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశముంది.

– దేశేనాయక్, ఎస్ఈ, ఏపీఆర్ హెచ్ఎన్ఎస్ఎస్

జగ్జీవన్ ఆశయ సాధనే ధ్యేయం

• ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి



జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనంత, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, బీసీ కమిషన్ సభ్యుడు కిష్టప్ప తదితరులు

అనంతపురం క్రైం: బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనే లక్ష్యంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ.. జగ్జీవన్ రామ్ పోరాట పటిమను, పరిపాలన దక్షతను కొనియాడారు. 27 ఏళ్లకే శాసన మండలి సభ్యుడిగా ఎన్నికై, సుదీర్ఘ కాలం పార్లమెంట్‌లో ఉంటూ వివిధ హోదాల్లో ప్రజలకు సేవలందించారన్నారు. జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను పుణికిపుచ్చుకున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సైతం విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. పైసా ఖర్చు లేకుండా ఉన్నత విద్య, కార్పొరేట్ వైద్యాన్ని అందించి బడుగు బలహీన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో మేయర్ వసీం, బీసీ కమిషన్ సభ్యుడు కిష్టప్ప, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఎర్రిస్వామిరెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైఫుల్లా బేగ్, శ్రీదేవి, నాయకులు పామిడి వీరాంజనేయులు, అనిల్‌కుమార్ గౌడ్, కృష్ణవేణి, భారతి, గౌరి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జేసీ సోదరుల తీరే నీచం

• వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి: సమాజంలోని వ్యవస్థలను దుర్భాషలాడడం, పోలీసులను కించపరచడం లాంటి చర్యలు కేవలం జేసీ సోదరులకు మాత్రమే సాధ్యమని, వారి తీరే నీచాతినీచమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఐ ఆనందరావు ఆత్మహత్యను వక్రీకరిస్తూ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సంస్కార హీనంగా తప్పుడు ఆరోపణలు చేస్తూ.. స్థానిక ఎమ్మెల్యే కేతిరెడిపెద్దారెడ్డిపై బురద చల్లే ప్రయత్నం చేయడం సిగ్గు చేటన్నారు. తన వద్ద ఆధారాలుంటే విచారణ అధికారులకు వాటిని అందజేసి సహకరించాలన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ గట్టిగా మాట్లాడితే బెదిరిపోయే పరిస్థితి లేదన్నారు. వాస్తవానికి జేసీ ప్రభాకరరెడ్డి దౌర్జన్యాలు, బెదిరింపులకు భయపడే సీఐ ఆనందరావు ఆత్మహత్య చేసుకున్నాడేమోననే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయన్నారు. కొన్ని నెలల క్రితం సీఐ ఆనందరావును తన ఇంటి వద్ద జేసీ ప్రభాకరరెడ్డి రొమ్ములపై దాడి చేసి, రాయలేని భాషలో బూతులతో విరుచుకుపడిన జేసీ ప్రభాకరరెడ్డి తీరుపై వీడియో వైరల్ అవుతుండడమే ఇందుకు నిదర్శనమన్నారు. గతంలో జేసీ ప్రభాకరరెడ్డి వద్ద పని చేసిన కంప్యూటర్ ఆపరేటర్ హరి ఆత్మహత్య ఘటనలో ఆయన పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. దమ్ముంటే వీటిపై విచారణకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రంగనాథరెడ్డి, రామశేఖర్, గురుశంకర్, బాబా పాల్గొన్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య నిరసన



భర్త ఇంటి ఎదుట బైఠాయించిన రాజేశ్వరి

గుంతకల్లు: రెండో పెళ్లి సిద్ధమైన భర్త ఇంటి ఎదుట భార్య నిరసనకు దిగిన ఘటన గురువారం పాత గుంతకల్లులో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన మేరకు.. పాత గుంతకల్లులోని అంకాలమ్మ గుడి వద్ద నివాసముంటున్న భాస్కర్‌కు 2016లో విడపనకల్లుకు చెందిన రాజేశ్వరితో వివాహమైంది. కట్న కానుకల కింద రూ.10లక్షల నగదుతో పాటు 20 తులాల బంగారు నగలను రాజేశ్వరి తల్లిదండ్రులు ఇచ్చారు. ప్రస్తుతం వీరికి ఓ కుమార్తె ఉంది. ఇటీవల భాస్కర్ రూ.30 లక్షలు ఖర్చు చేసి తన చెల్లెలు పెళ్లి జరిపించాడు. అప్పటి వరకూ సజావుగా సాగిన రాజేశ్వరి సంసారంలో ఆడపడచు పెళ్లి తర్వాత గొడవలు మొదలయ్యాయి. అప్పులు ఎక్కువగా ఉన్నాయని అదనపు కట్నం కింద రూ.10లక్షలు తీసుకురావాలని రోజూ భాస్కర్, అతని తల్లిదండ్రులు వేధించేవారు. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో జీవితంపై విరక్తి చెంది 2020లో రాజేశ్వరి ఆత్మహత్యాయత్నం చేసింది. దీనిపై అప్పట్లో భాస్కర్‌తో పాటు అత్త, మామపై పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. దీంతో రాజేశ్వరిని తల్లిదండ్రులు పుట్టింటికి పిలుచుకెళ్లారు. ఆ తర్వాత తనకు విడాకులు కావాలంటూ 2021లో న్యాయస్థానాన్ని భాస్కర్ ఆశ్రయించాడు. అయితే విడాకులు ఇవ్వడం తనకు ఇష్టం లేకపోవడంతో కోర్టుకు రాజేశ్వరి హాజరు కాలేదు. ఈ క్రమంలో గుట్టు చప్పుడు కాకుండా రెండో పెళ్లికి భాస్కర్ సిద్ధం కావడంతో విషయం తెలుసుకున్న రాజేశ్వరి గురువారం ఉదయం నేరుగా భర్త ఇంటికి చేరుకుని తనకు న్యాయం చేయాలంటూ బైఠాయించింది. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు భాస్కర్‌ను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. కోర్టు పరిధిలో కేసు ఉండడంతో తాము జోక్యం చేసుకోలేమని టూటౌన్ సీఐ గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్ విలేకరులతో మాట్లాడుతూ.. రాజేశ్వరి 2020లో ఉద్దేశపూర్వకంగా విషపూరిత ద్రావకం తాగి తన కుటుంబాన్ని అభాసుపాలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆమెతో కలసి తాను జీవించలేక విడిపోవాలని నిర్ణయించుకుని 2021లో విడాకులు కోరుతూ కోర్టులో దావా వేసినట్లు వివరించారు.

ఎంటీఎస్ టీచర్లపై వివక్ష

రాప్తాడు రూరల్: కొందరు మండల విద్యాశాఖ అధికారులు చూపుతున్న వివక్ష కారణంగా చాలామంది 98–డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లకు ఏప్రిల్ నెల జీతాలు అందలేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 390 మంది 98–డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లు పని చేస్తున్నారు. వీరంతా ఏప్రిల్ 13న విధుల్లో చేరారు. ఆ నెలలో 18 రోజులు పని చేశారు. విధుల్లో చేరే రోజు దాదాపు అందరూ అగ్రిమెంట్ బాండ్లు ఇచ్చేశారు. 18 రోజులకు గాను రూ.19,402 జీతం రావాల్సి ఉంది. అయితే మండల విద్యాశాఖ అధికారులు బిల్లులు పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కళ్యాణదుర్గం, కూడేరు, గుమ్మఘట్ట, లేపాక్షి, బెళుగుప్ప, రాయదుర్గం తదితర మండలాల్లో దాదాపు 50 మంది వరకు జీతాలు చేశారు. మిగిలిన 340 మందికి బిల్లులకు ఆమోదం తెలపడంతో ఆయా ఎంఈఓలు మీనమేషాలు లెక్కిస్తున్నారు. 23 ఏళ్ల తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో తామంతా ఉద్యోగాల్లో చేరామని అయితే ఎంఈఓలు ఇలా బిల్లులు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారంటూ పలువురు ఎంటీఎస్‌లు వాపోతున్నారు.

ప్రమోషన్ ఇచ్చి.. వెనక్కు తీసుకున్నారు

రాప్తాడు రూరల్: స్కూల్ అసిస్టెంట్ (గణితం)గా పదోన్నతి ఇచ్చి వెనక్కు తీసుకున్నారంటూ బెళుగుప్ప మండలం విరుపాపల్లి ఎంపీయూపీ స్కూల్ ఎస్జీటీగా పని చేస్తున్న సురేఖ వాపోయింది. ఈ మేరకు గురువారం గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రవీంద్రనాథ్‌తో కలిసి డీఈఓ ఎం.సాయిరామ్‌కు విన్నవించింది. బుధవారం స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల కౌన్సెలింగ్ జరిగింది. సీనియార్టీ జాబితాలో ఉన్న సురేఖ పదోన్నతి తీసుకుని కళ్యాణదుర్గం మండలం ముదిగల్లు ఎంపీయూపీ స్కూల్ స్థానాన్ని ఎంచుకుంది. సాయంత్రం 4.30 గంటలకు కౌన్సెలింగ్ ముగిసింది. అయితే ఉత్తర్వులు మాత్రం ఇంకా ఇవ్వలేదు. 5.30 గంటలకు మరో టీచర్ జె.ప్రభావతి వచ్చి అభ్యంతరం తెలపడంతో సురేఖకు ఫోన్ చేసి ప్రభావతికి పదోన్నతి ఇస్తున్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరుకాని టీచరుకు ఎలా పదోన్నతి ఇస్తారని సురేఖ ప్రశ్నించారు.

జగనన్నతోనే గ్రామ స్వరాజ్యం

• మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



కుల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం రూరల్: గ్రామ స్వరాజ్య స్థాపన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామంలో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. సర్టిఫికెట్ల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న కారణంతో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా 11 రకాల సర్టిఫికెట్లను ప్రజలకు అందించే బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలు సూచించిన వారికి మాత్రమే పథకాలు అందేవని, నేడు అర్హత ప్రామాణికంగా పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందుతున్నాయని స్పష్టంచేశారు. ఈ నాలుగేళ్లలో గోళ్ల పంచాయతీలో 4,184 మందికి రూ.10 కోట్ల లబ్ధి చేకూరిందని గుర్తు చేశారు. ఇతర పార్టీల పథకాలను కాపీ కొడుతూ చంద్రబాబు మేనిఫెస్టో తయారు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు మాటలు నమ్మి మోసపోరాదని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు పలు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు ఎంఆర్‌సీ రెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ ఎం.మంజుల, జెడ్పీటీసీ సభ్యుడు బొమ్మన్న, ఎంపీపీ మారుతమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సర్వోత్తమ, జీసీఎస్ సచివాలయాల ఇన్‌చార్జ్ ఆంజనేయులు, సేవాదళ్ జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రెహమాన్, ఎంపీడీఓ సాల్మన్, ఈఓఆర్డీ బాలాజీ, స్థానిక నాయకులు రామలింగప్ప, శీనప్ప, పోతేష్, శంకర్‌రెడ్డి, గోవిందప్ప, కొండారెడ్డి, నాగేంద్ర, సూరి, బోరంపల్లి సోమశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హేమలత పాల్గొన్నారు.

రైతుల గురించి మాట్లాడే నైతికత నీకెక్కడిది?

• ఎమ్మెల్యే కేశవ్‌పై మాజీ ఎమ్మెల్యే విశ్వ ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విశ్వ

ఉరవకొండ: రైతులపై కేసులు నమోదు చేసారంటూ పబ్లిసిటీ కోసం ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మొసలి కన్నీరు కారుస్తున్నాడని, వాస్తవానికి రైతుల గురించి మాట్లాడే నైతికత కేశవ్‌కు ఎక్కడుందని వైఎస్సార్‌సీపీ ఉరవకొండ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. ఉరవకొండలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ నాయకులను అడ్డుపెట్టుకుని రైతుల పేరుతో కేశవ్ దిగజారుడు రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. రైతుల సంక్షేమం కోసం గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. రైతు పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్ ఖ్యాతి గడించారన్నారు. వ్యవసాయాన్ని సుసంపన్నం చేసేందుకు ప్రత్యేకంగా మిషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. పంట నష్టం జరిగితే రైతును ఆదుకోవడంలో అందరి కంటే ముందు జగన్ సర్కార్ ఉంటోందన్నారు. రైతులకు సకాలంలో ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ అందజేస్తున్నామన్నారు. గత ఏడాది అత్యధికంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూ.850 కోట్లకు పైగా పంటల బీమా అందడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇందులో ఒక్క ఉరవకొండ నియోజకవర్గానికి రూ.100 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకునేందుకు రాజకీయాలకు అతీతంగా రూ.6 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో చెట్ల కింద కూర్చొని రైతుల పేరుతో పథకాలను దోచుకున్నారని మండిపడ్డారు. అప్పట్లో రైతులు అత్యధికంగా ఆత్మహత్య చేసుకున్నా ఏ రోజైనా ఒక్క రైతు కుటుంబాన్ని పరామర్శించిన దాఖలాలు కేశవ్ చరిత్రలో లేవన్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

జూనోటిక్ వ్యాధులతో జాగ్రత్త

• రేబీస్, బ్రూసెల్లోసీస్, బర్డ్‌ఫ్లూ, అంత్రాక్స్ లాంటివి ప్రమాదకరం
• పశుశాఖ జేడీ సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం (చిత్రంలో) డీడీ రమేష్‌రెడ్డి, ఏడీలు, డాక్టర్లు

అనంతపురం అగ్రికల్చర్: జంతువులు, పశుపక్షాదుల నుంచి మానవులకు సంక్రమించే 'జూనోటిక్' వ్యాధులపై జాగ్రత్తతో మెలగాలని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. అనంతపురంలోని సాయినగర్ పశువుల ఆస్పత్రి ప్రాంగణంలో వీహెచ్ ఏడీ డాక్టర్ సురేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రపంచ జూనోసిస్ దినోత్సవంలో జేడీతో పాటు డివిజన్ డీడీ డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, ఏడీ డాక్టర్ పద్మనాభం, డాక్టర్ గోల్డ్‌స్మన్, 1962 అంబులెన్స్ డాక్టర్లు డాక్టర్ సునీత, డాక్టర్ సుచరిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూనోటిక్ వ్యాధులు, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జూనోసిస్ దినోత్సవ ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. జంతువులు, పక్షులు పెంపకం దారులు, వాటితో ఎక్కువగా కలిసి ఉండేవారు, పశువుల ఆస్పత్రుల్లో పనిచేసేవారు సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోతే ప్రమాదకరమైన జబ్బులు సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రధానంగా రేబీస్, బ్రూసెల్లోసీస్, అంత్రాక్స్ (దొమ్మవ్యాధి), స్వైన్‌ఫ్లూ, బర్డ్‌ఫ్లూ లాంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందన్నారు. వైరస్, బ్యాక్టీరియా, ఫంగస్ లాంటి సూక్ష్మక్రిముల కారణంగా ఈ వ్యాధులు వ్యాపించి ప్రజారోగ్యంపై ప్రభావం చూపిస్తాయన్నారు. ఉడికించిన మాంసం తీసుకోవడం, బాగా కాచిన పాలు తాగడం లాంటి మరికొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వీటి బారి నుంచి రక్షించుకునే వీలుందన్నారు. వీటి గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఏటా జూలై 6న ప్రపంచ వ్యాప్తంగా జూనోసిస్ దినోత్సవాన్ని జరుపుకోవడం అనవాయితీగా వస్తోందన్నారు. అనంతరం జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పశువుల ఆస్పత్రికి పెద్ద ఎత్తున పెంపుడు కుక్కలు, పిల్లులు, కోళ్లు, గొర్రె, మేక పిల్లలకు ఉచితంగా టీకాలు వేశారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి

అనంతపురం: మూడు రోజుల క్రితం విడుదలైన జీ–ప్యాట్ (గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఫార్మసీ)లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల విద్యార్థులు 8 మంది సత్తా చాటారు. ఉపకారవేతనం పొందడానికి అర్హత సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు గోపాల్, అశోక్, భరత్, సుహానా, ప్రేమజ, రుతురాణి, రాజు, గోపాల్‌ను గురువారం ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ పి. వెంకటరమణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోమశేఖర్, సీడీసీ డీన్ ప్రొఫెసర్ కే. రాంగోపాల్, మాజీ రెక్టార్ ప్రొఫెసర్ ఏ.మల్లికార్జున రెడ్డి తదితరులున్నారు.

విద్యార్థికి పాముకాటు



విద్యార్థిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: పాఠశాలకు వచ్చిన ఓ విద్యార్థి పాముకాటుకు గురయ్యాడు. వివరాలు.. పెద్దవడుగూరు మండలం కోనాపురం గ్రామానికి చెందిన హరినాథ్... నగరూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం 8 గంటలకు పాఠశాలకు చేరుకున్న హరినాథ్... ఆవరణలో బూట్లు వదిలి తన హోం వర్క్ చేసుకున్నాడు. ఇంతలో బెల్ మోగడంతో హడావుడిగా బూట్లు ధరించి ప్రేయర్‌కు హాజరయ్యాడు. ఇంతలో తన కాలుకు ఏదో కుట్టిందంటూ గట్టిగా అరవడంతో హరినాథ్‌ను పీడీ మహబూబ్‌బాషా పక్కకు పిలుచుకెళ్లి బూట్లు విప్పించి చూడగా, లోపల నుంచి ఓ పాము బయటకు వచ్చింది. వెంటనే పామును చంపేసి, బాధిత విద్యార్థిని తన ద్విచక్ర వాహనంపై తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి పీడీ తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆస్పత్రికి చేరుకుని బాధిత విద్యార్థిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. సకాలంలో విద్యార్థిని ఆస్పత్రికి తీసుకురావడంతో ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలపడంతో అక్కడే ఉన్న పీడీ మహబూబ్‌బాషాను ఎమ్మెల్యే అభినందించారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీటి సరఫరా

• శ్రీసత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్ డీఈ రామారావు



గేట్‌వాల్వ్‌లు తెరుస్తున్న దృశ్యం

కూడేరు: కార్మికులు సమ్మెలోకి వెళ్లినా... ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా శ్రీసత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్ ద్వారా నీటి సరఫరాను కొనసాగిస్తున్నట్లు ఆ ప్రాజెక్ట్ డీఈ రామారావు తెలిపారు. గురువారం ఆయన గేట్ వాల్వ్‌లు తెరిచి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా మాట్లాడతుఉ.. కార్మికుల డిమాండ్ పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. అయితే తక్షణ పరిష్కారం కోరుతూ కార్మికులు బుధవారం నుంచి సమ్మెలోకి వెళ్లారన్నారు. సమ్మె కారణంగా తాగునీటి సరఫరా ఆగకూడదని ఇరిగేషన్ అధికారులను సమన్వయం చేసుకుని నీటి సరఫరా కొనసాగిస్తున్నామన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని, వెంటనే సమ్మె విరమించి విధుల్లోకి చేరాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని చూపుతున్న విజిలెన్స్ అధికారులు

తాడిపత్రి: మండలంలోని పెన్నా పాత బ్రిడ్జి సమీపంలో విజిలెన్స్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో 53 బస్తాల్లో తరలిస్తున్న 30.90 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని స్థానిక పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించినట్లు విజిలెన్స్ సీఐ వెంకటరమణ తెలిపారు. బొలెరో పికప్ వాహనాన్ని సీజ్ చేసి, బియ్యం రవాణా చేస్తున్న డ్రైవర్, వ్యాపారి జూటూరు రామాంజినేయులు, వాహన యజమాని సోమన్నగారి నాగరాజుపై కేసు నమోదు చేశారు.

సేవా కార్యక్రమాలపై చైతన్య పరచాలి

అనంతపురం: విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా విద్యార్థులను చైతన్య పరచాలని ఎస్కేయూ వీసీ ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం, కమ్యూనిటీ సర్వీసెస్, లిటరసీ, న్యూమరసీ కార్యక్రమాలపై ఎస్కేయూలోని పూలే భవనంలో గురువారం బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్, ఉన్నత విద్యామండలి, సమగ్రశిక్ష, యూనిసెఫ్ ఆధ్వర్యంలో బోర్డ్‌ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (బీసీడీఈ)కు సంబంధించిన నోడల్ ఆఫీసర్లకు ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ.. అనుబంధ డిగ్రీ కళాశాలల్లో కమ్యూనిటీ ప్రాజెక్టులు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈ ప్రాజెక్టుల వల్ల విద్యార్థుల్లో చదవడం, మాట్లాడడం, రాయడం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. ఎస్కేయూ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.కృష్ణకుమారి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో బీసీడీఈ సీఈఓ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. సత్యనారాయణ, యూనిసెఫ్ కన్సల్టెంట్ టి.సుదర్శన్, శిక్షణ ఫౌండేషన్ ఆపరేషన్ మేనేజర్ అప్పారావు, సమగ్రశిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ చంద్రమోహన్ రెడ్డి, రిసోర్స్ పర్సన్ మదన్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు లలితా సహస్రనామ హోమం

అనంతపురం కల్చరల్: పాతూరులోని శృంగేరీ శారదా పీఠం దత్తాత్రేయ దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 8న లలితా సహస్రనామ హోమం జరగనుంది. ఈ మేరకు ఆలయంలో జరిగిన సమావేశంలో మేనేజర్ అప్పాసుధీర్ తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి హోమాలు ప్రారంభమవుతాయని, అధిక సంఖ్యలో మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేస్తారన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో నడవాలి


బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

అనంతపురం: బాబూ జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వీనర్ యనమల ప్రసాద్ అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ 37వ వర్ధంతిని పురస్కరించుకొని ఎస్కేయూ క్యాంపస్‌లో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు బాలరాజు, సునీల్, గోవింద్, మునిరత్నం, మారన్న, బాబావలి, దావూద్, పవన్, లక్ష్మణ్, మోతీలాల్, రామకృష్ణ, యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించాలి

అనంతపురం క్రైం: జేఎన్‌టీయూ రోడ్డు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న నేషనల్ ప్రోగ్రాం ఆఫ్ కంట్రోలింగ్ బ్లైండ్‌నెస్(ఎన్‌పీసీబీ) యూనిట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్‌ఎస్ వెంకటేశ్వర రావు డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్‌ను కోరారు. ఆరోగ్యశాఖ పరిధిలో ఎన్‌పీసీబీ యూనిట్ వస్తుందని, అపరిశుభ్రంగా ఉందని, శస్త్రచికిత్సలకు వచ్చే రోగులు ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను విడుదల చేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమా, ఎల్‌ఎం మోహన్‌రెడ్డి


అనంతపురం క్రైం: జిల్లాలోని కళ్యాణదుర్గంలో ఈ నెల 8న విచ్చేస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేయనున్న పోస్టర్లను గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమా, మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి గురువారం గ్రంథాలయ ఆవరణంలోని వైఎస్సార్ విగ్రహం ముందు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాల నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం


సీఎం సభకు తరలిరావాలని పిలుపునిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: ఈ నెల 8న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్యాణదుర్గం పర్యటనను విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జొన్నగిరి బాలపోతన్న, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి పర్యటించారు. అదేరోజు దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి, కేక్ కట్ చేసి సీఎం సభకు వెళ్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు అంజినప్ప, పరిగిరెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో హరేంద్రనాథ్ ప్రతిభ


హరేంద్రనాథ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కరీంఖాన్

అనంతపురం: గత నెల అనంతపురంలోని ఆర్డీటీ గ్రామంలో నిర్వహించిన మినీ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో సెంట్రల్ స్కూల్ విద్యార్థి కేఎస్ హరేంద్రనాథ్ ప్రతిభ కనబరిచారు. ఆంధ్రప్రదేశ్ అండర్-13 బాలుర జట్టు మొదటి స్థానం దక్కించుకుంది. ఇందులో హరేంద్రనాథ్ కీలక పాత్ర పోషించారు. 12 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఈ క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెంట్రల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.కరీంఖాన్ కేఎస్ హరేంద్రనాథ్‌ను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిద్దాం.. జూనోసిస్‌ను జయిద్దాం!

పెంపుడు జంతువులతోపాటు పశుపక్షాదులను అమితంగా ఇష్టపడుతుంటాం..వాటిని పసిపిల్లల్లా పెంచుకుంటాం..వాటితో మనుగడ సాగిస్తుంటాం..అయితే జంతువుల ద్వారా మనుషులకు జూనోటిక్ వ్యాధులైన రేబిస్, అంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, లాప్టోస్పైరిస్ లాంటి ప్రమాదకర, ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వ్యాధులపై అవగాహన ఉంటే సమస్య ఉండదు. ముందుజాగ్రత్తగా టీకా వేయిస్తే వ్యాధులను అదుపులో ఉంచొచ్చు. జూలై 6న జూనోసిస్ డే సందర్భంగా నగరంలోని సాయినగర్ పశువైద్యకేంద్రానికి జంతుప్రేమికులు వ్యాక్సిన్ వేయించేందుకు వివిధ రకాల జంతువులు, పశుపక్షాదులను తీసుకొచ్చారు. దీంతో పశువైద్య కేంద్రం ఆవరణ కిక్కిరిసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


శునకాలకు వైద్యం చేయిస్తున్న యజమానులు


వ్యాక్సిన్ వేయించడానికి కార్లలో శునకాలను తీసుకువస్తున్న దృశ్యం


కోతికి వ్యాక్సిన్ వేయిస్తున్న యజమాని


వ్యాక్సిన్ వేయించడానికి పేర్లు నమోదు చేస్తున్న దృశ్యం

జగన్‌ను మళ్లీ సీఎంగా చూడాలన్నదే లక్ష్యం

అనంతపురం సిటీ: ముస్లిం, మైనార్టీల అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌ని మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలన్నదే తమ లక్ష్యమని అనంతపురం నగర మేయర్ మహమ్మద్ వసీం సలీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ హిరియల్ నదీమ్ అహమ్మద్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ అన్నారు. గురువారం నగరంలోని మస్జీద్-ఏ-గౌస్‌మొద్దీన్ మసీదులో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'హర్ దిల్ మే వైఎస్సార్-హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమానికి హైన పేర్కొన్న ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, కార్పొరేటర్ రహంతుల్లా, నాయకులు గఫార్, ముహీబ్, ముతవల్లి సైపుల్లా, ఇమామ్ రహంతుల్లా, కమిటీ సభ్యులు ముస్తాక్, మౌలానా, మహమ్మద్ రఫీ, మహబూబ్‌బాషా పాల్గొన్నారు. మసీదు పెద్దలు, ముస్లింలతో వారు సమావేశమయ్యారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉంటేనే ముస్లిం మైనార్టీలకు సామాజిక భద్రత సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు మతతత్వ బీజేపీతో లోపాయికారి ఒప్పందాలు చేసుకుని ముస్లిం మైనార్టీలను మరోసారి మోసగించేందుకు కుట్ర పన్నుతున్నట్లు తెలిపారు.


బ్రోచర్లు విడుదల చేస్తున్న మేయర్ వసీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం తదితరులు

సీనియర్ ఉమెన్ జట్టు గెలుపు

అనంతపురం: అనంతపురం జిల్లా ఉమెన్ క్రికెట్ టోర్నీ జట్టు ఎంపికలో భాగంగా గురువారం అండర్-19 ఉమెన్, సీనియర్ ఉమెన్ జట్ల మధ్య నిర్వహించిన మ్యాచ్‌లో సీనియర్ జట్టు గెలుపొందింది. మొత్తం 50 ఓవర్లకు గాను 297 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఎన్.హరిత 57 బంతుల్లో 75 పరుగులు (11 ఫోర్లు), పి.మనీషా 35 పరుగులు, ఏ కరిష్మా 40 పరుగులు చేసి సత్తా చాటారు. అనంతరం బ్యాటింగ్ చేసిన అండర్-19 జట్టు 50 ఓవర్లలో 228 పరుగులు చేసి ఆలౌట్ అయ్యారు. బి. నేహా 58 పరుగులు, ఎస్. ఆశ్రియా 78 పరుగులు (77 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్సర్) కీలక ఇన్నింగ్స్ ఆడినప్పటికీ విజయం దక్కలేదు. భావన 22 పరుగులు చేసి మూడు వికెట్లు తీసి సీనియర్ జట్టు గెలుపునకు దోహదపడ్డారు. 69 పరుగుల తేడాతో సీనియర్ జట్టు గెలుపొందింది.

- అనంతపురం- కడప , చిత్తూరు-కడప జట్ల మధ్య మల్టీ డే అంతర జిల్లా సీనియర్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం అనంతపురం -కడప జట్ల మధ్య స్కోరు ఈ విధంగా ఉంది. తొలుత బ్యాటింగ్ చేసిన అనంతపురం 369 పరుగులు సాధించింది. కడప జట్టు 90.4 ఓవర్లలో 308 పరుగులు చేసింది. టి. వంశీకృష్ణ 155 పరుగులు (272 బంతుల్లో 17 ఫోర్లు, నాలుగు సిక్సర్లు) చేసి సత్తా చాటాడు.


ఆశ్రియ (78 పరుగులు)


హరిత (75 పరుగులు)

- చిత్తూరు, కర్నూలు జట్ల మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 102 పరుగులకే ఆలౌట్ అయింది. చిత్తూరు జట్టు 55.5 ఓవర్లలో 213 పరుగులు చేసి ఆలౌట్ అయింది. కర్నూలు జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 65 ఓవర్లకు గాను 214 పరుగులు చేసి రెండు వికెట్లు కోల్పోయింది. యుఎంఎస్ గిరినాథ్ 204 బంతుల్లో 114 నాటౌట్ (15 ఫోర్లు) చేసి జట్టు విజయానికి బాటలు వేశాడు. కరణ్ షిండే 86 బంతుల్లో 68 పరుగులు చేశారు.

నేడు 'జగనన్న సురక్ష'

ఆత్మకూరు: మండలంలోని వేపచెర్ల గ్రామ పంచాయతీలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్ ప్రసాద్, ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని పిలుపునిచ్చారు.

మంగళపల్లి బాలమురళీకృష్ణకు నివాళి

అనంతపురం కల్చరల్: స్థానిక త్యాగరాజ సంగీత సభలో మంగళంపల్లి 93వ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. త్యాగరాజ సంగీత సభ అధ్యక్షుడు ఎన్సీ సంపత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అరుదైన ఆడిటోరియంగా జిల్లా కేంద్రంలో మంగళంపల్లి బాలమురళీకృష్ణ ఆడిటోరియంగా నామకరణం చేసి సంగీత, నృత్యాలకు ఎనలేని సేవలందించేలా అందరూ కృషి చేస్తున్నారని గుర్తు చేసుకున్నారు. మంగళపల్లి ఆశయాలను పాటించేలా భవిష్యత్తులో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించడానికి సభ తీర్మానించిందన్నారు.

అన్నదానంతో అన్నపూర్ణేశ్వరుడి సేవ చేసినట్లే

అనంతపురం క్రైం: అన్నదానం అన్నపూర్ణేశ్వరుడికి సేవ చేసినట్లేనని చిన్మయ మిషన్ ఆత్మవిధానంద స్వామీజీ పేర్కొన్నారు. గురువారం సాయిట్రస్టు ఆధ్వర్యంలో సాయి నిత్య నారాయణ సేవ కార్యక్రమం 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జీజీహెచ్‌లో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ట్రస్టు వ్యవస్థాపకులు విజయసాయి, సభ్యులు రాఘవేంద్ర, నారాయణ, అనిల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ ర్యాపిడ్ కిట్లు అవసరం

అనంతపురం క్రైం: మైక్రోబయాలజీ విభాగానికి డెంగీ ర్యాపిడ్ కిట్లను అందించేలా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావును మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ శాంతిరెడ్డి కోరారు. గురువారం జీజీహెచ్‌లో ఆమె సూపరింటెండెంట్‌ను కలిశారు. ప్రస్తుతం 40 కిట్లు మాత్రమే ఉన్నాయని, సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో కనీసం 200 కిట్లు అందుబాటులో ఉండాలని కోరగా, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

ముందస్తు జాగ్రత్తలతో డెంగీ దూరం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్

అనంతపురం క్రైం: ముందస్తు జాగ్రత్తలతో డెంగీ, ఇతర దోమకాటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. గురువారం డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా ర్యాలీని డీఎంహెచ్‌ఓ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకు, అక్కడి నుంచి ప్రభుత్వ సర్వజనాస్పత్రి వరకు సాగింది. డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ డెంగీ వ్యాధి ప్రాణాంతకమైందన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలన్నారు. వారంలో ఒక రోజు డ్రైడేని తప్పక పాటించాలన్నారు. ర్యాలీలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ మనోజ్, మలేరియా అధికారి ఓబులు, సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, డెమో విభాగం ఉమాపతి, త్యాగరాజు, గంగాధర్, పద్మావతి నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలో గురువారం వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో జాతీయ డెంగీ మాసోత్సవాలను నిర్వహించారు. మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సబీహా సుల్తానా, ఎంపీహెచ్‌ఓ నాగేశ్వరయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది, చిత్రంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్

అగ్నిప్రమాదాలపై అవగాహన తప్పనిసరి

అనంతపురం సెంట్రల్: ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్టీసీ డిపో మేనేజర్ నాగభూపాల్, అగ్నిమాపక అధికారి లింగమయ్య సూచించారు. గురువారం ఆర్టీసీ డిపో గ్యారేజీలో అగ్ని ప్రమాదాలపై డెమో నిర్వహించారు. వారు మాట్లాడుతూ అగ్ని నియంత్రణ సిలిండర్ల వినియోగం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. పరిసరాల్లో ఆయిల్‌తో ఉన్న బట్టలు, చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్ పరికరాలను ఉపయోగించేటప్పుడు నాణ్యమైన కేబుల్‌ను వాడాలన్నారు. నియంత్రణ పరికరాలు సరిగ్గా పనిచేస్తున్నాయా లేదా అన్నది తరచూ తనిఖీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ గ్యారేజీ ఇన్‌చార్జ్ ఇక్బాల్, ఫైర్ సిబ్బంది రమేష్, బాల, వెంకటయ్య, తిప్పేస్వామి, ఎల్ఎఫ్ కృష్ణకుమార్, ఆర్టీసీ గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.


గ్యారేజ్ కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు

'ఎకో'కు ఎక్కడికీ పోకుండా...


చిన్నారికి టూడీ ఎకో పరీక్ష చేస్తున్న దృశ్యం

- జీజీహెచ్‌లో అందుబాటులోకి టూడీ ఎకో సేవ
- ఉచితంగా రూ.వెయ్యి ఖర్చయ్యే పరీక్ష

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన సేవలు ఒక్కొక్కటికీ అందుబాటులోకి వస్తున్నాయి. గతంలో టూడీ ఎకో సేవలు లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. రూ.వెయ్యి వెచ్చించి పరీక్ష చేయించుకోవాల్సి వచ్చింది. పేద ప్రజల ఇబ్బందులను గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం తాజాగా ఆ సేవలను ఆస్పత్రిలోనే అందుబాటులోకి తెచ్చింది. సోమ, గురువారం, శనివారం టూడీ ఎకో పరీక్ష చేస్తున్నారు. ప్రస్తుత రోజుల్లో శస్త్రచికిత్స, ఇతర అత్యవసర సేవలకు టూడీ ఎకో పరీక్ష ప్రామాణికంగా మారింది. అప్పుడే పుట్టిన పసికందుల్లో గుండె సమస్యలు గుర్తించాలంటే వైద్యులు ఈ పరీక్షకు సిఫార్సు చేస్తారు. వచ్చే ఫలితం బట్టి సమస్యలుంటే సత్వర వైద్యం అందిస్తారు. అలాంటి పరీక్ష ప్రభుత్వ ఆస్పత్రిలో చేయకపోవడంతో పేద ప్రజలు ఇబ్బంది పడేవారు. తాజాగా ఆ సేవ కూడా అందుబాటులోకి రావడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు.

శస్త్రచికిత్సలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు

అనంతపురం క్రైం: అప్తాల్మిక్ ఆపరేషన్ థియేటర్ కల్చర్ స్వాప్ నెగిటివ్ వచ్చిందని, మరో రెండు సార్లు నెగిటివ్ వస్తే శస్త్రచికిత్సలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం జీజీహెచ్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. గత నెల 26న రామస్వామి (72, ఓటీఆర్ కాలనీ, అనంతపురం), బాలమ్మ (34, ఆత్మకూరు), బీ అనసూయమ్మ (57) కూడేరు, మహాలక్ష్మి (40) ముక్తాపురం అనే వారు అప్తాల్మిక్ విభాగంలో అడ్మిట్ కాగా, 27న వారికి కంటి విభాగం వైద్యులు శస్త్రచికిత్సలు చేసినట్లు తెలిపారు. వీరికి కంటి సమస్య రావడంతో ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేయడంతో పాటు హెచ్‌ఓడీలు డాక్టర్ శాంతిరెడ్డి, డాక్టర్ రామస్వామినాయక్, డాక్టర్ నవీన్‌కుమార్‌తో విచారణ చేయించామన్నారు. కంటి ఆపరేషన్ థియేటర్‌కు హారిజాంటల్ ఆటో అనలైజర్ కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఆప్తమాలజీ ఇన్‌చార్జ్ హెచ్‌ఓడీ డాక్టర్ గీత, ఆప్తమాలజిస్టు డాక్టర్ వైఎంఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పరిశీలన..

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా ఆస్పత్రిలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వివిధ పరికరాలు, మందులు, తదితర వాటిని అందుబాటులో ఉంచాలన్నారు. ఆర్ఎంఓ వైవీరావు, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సౌజన్య కుమార్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

అనంతపురం సిటీ: అనంతపురం కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ఏఐవైఎఫ్ నాయకులు గురువారం ధర్నా చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణం భర్తీ చేసి, నిరుద్యోగులను ఆదుకోవాలని కోరుతూ వారు ఆందోళన చేశారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి రాకెట్ల రాము, వివిధ నియోజకవర్గాల కార్యదర్శులు ధనుంజయ, కొట్రేష్, అనంతపురం నగర అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫెయిల్ అయిన విద్యార్థులకు మళ్లీ అడ్మిషన్లు

ఆత్మకూరు: పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు మళ్లీ అదే పాఠశాలలో, అదే అడ్మిషన్ నంబర్‌తో పదోగతరగతి చదవచ్చని ఎంఈఓ నరసింహారెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ఒక పరీక్ష తప్పిన ఒకటికి మించి ఎన్ని సబ్జెక్టులు తప్పినా వారు పరీక్షలు మొత్తం కాని, లేదా వారుతప్పిన సబ్జెక్టులు గాని రాసుకోవచ్చన్నారు. మండల వ్యాప్తంగా కేజీబీవీలో ఐదుగురు, బి.యాలేరు ఉన్నత పాఠశాలలో 8 మంది, ముట్టాల ఉన్నత పాఠశాలలో 10 మంది, తోపుదుర్తి ఉన్నత పాఠశాలలో 12 మంది, తలుపూరు ఉన్నత పాఠశాలలో 16 మంది, సనప ఉన్నత పాఠశాలలో 16 మంది, ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో 40 మంది ఫెయిల్ అయిన విద్యార్థులు ఉన్నారన్నారు. గురువారం కేజీబీవీలో ఇద్దరు విద్యార్థులకు చేర్చుకున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రాప్తాడు: రైతు సంక్షేమ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ జయలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని బొమ్మేపర్తి గ్రామంలో స్థానిక రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం రైతులకు సబ్సిడీ కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులైన రైతులందరికీ కంది విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తాం


నూతన ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణను అభినందిస్తున్న వీసీ జింకా రంగజనార్దన


ఫారిన్ అఫైర్స్ డీన్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ పి. సుజాతను అభినందిస్తున్న వీసీ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలోని పలు పదవుల్లో నియామకం అయిన ప్రొఫెసర్లు పలువురు గురువారం బాధ్యతలు చేపట్టారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అభినందనలు తెలిపారు.

- జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఈ. అరుణాకాంతి బాధ్యతలు స్వీకరించారు.
- డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ ఆర్.కిరణ్మయి , ఫారిన్ అఫైర్స్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పి. సుజాత, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ వీబీ చిత్ర, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా డాక్టర్ జే. శ్రీనివాసులు, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా అజిత బాధ్యతలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి వేడుకలు

అనంతపురం కల్చరల్: ఆషాఢమాసంలో వచ్చిన పవిత్ర సంకష్టహర చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వరుడికి ప్రీతిపాత్రమైన గురువారం సంకష్టహర చతుర్థి రావడంతో గీతా మందిరం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం అభిషేకాలు, అర్చనలు రాత్రి విశేష అలంకార సేవలు, సామూహిక వ్రతాలు జరిగాయి. ప్రధాన అర్చకులు రాఘవేంద్ర ప్రసాద్, భరత్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి శాస్త్రోక్తంగా సహస్ర మోదకాలను సమర్పించి, అనంతరం భక్తులకు వాటిని ప్రసాదంగా వితరణ చేశారు. పాతూరు చెరువు కట్ట, రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీసిద్ధివినాయకుని ఆలయంలో సంకష్టహర వ్రతాలతో భక్తిభావం ఉట్టిపడేలా పూజలు సాగాయి.

ప్రజల వద్దకే 11 రకాల సేవలు

రాప్తాడు: 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే 11 రకాల సేవలు అందుతున్నాయని ఎంపీపీ జయలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని గాండ్లపర్తిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ జల్లెడపట్టి మరీ గుర్తించి సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. టీడీపీ నాయకులు చెప్పే మాయ మాటలు నమ్మే మోసపోవద్దని సూచించారు. ఏ సర్వీస్ చార్జీలు లేకుండా సర్టిఫికెట్లను (జనన, మరణ, కుల, ఆదాయ తదితర 11 రకాలు) ఇక్కడే అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ఎంపీడీవో సల్మాన్, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.


గాండ్లపర్తిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి